జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు
ఎడిటర్ : 90520 45435

PUBLISH IN HYDERABADH | సంపుటి : 01 సంచిక : 211 | SANDESHAM TIMES | శనివారం 27 - 12 - 2025 | SANDESHAM TIMES TELUGU DAILY

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.



## వ్యవసాయానికి చేయూతనివ్వండి

### కేంద్రానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సీఎం చంద్రబాబు భేటీ

కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని వినతి

కొబ్బరి పార్క్, ఆక్వా ల్యాబ్, మ్యాంగో బోర్డు ఏర్పాటుకు సహకరించాలన్న సీఎం

సూక్ష్మ సేద్యం విస్తరణకు రూ.695 కోట్లు కేటాయించాలని డిమాండ్

ఏపీని సహజ సాగుకు జాతీయ వనరుల రాష్ట్రంగా ప్రకటించాలని విజ్ఞప్తి

**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. అమరావతి పర్యటనలో భాగంగా తనను కలిసిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని చంద్రబాబు బలంగా కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. పంచ సూత్రాల ప్రణాళికతో వ్యవసాయంలో 10.70 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. నీటి భద్రత, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు చెప్పారు.

**ముఖ్యమంత్రి చేసిన ప్రధాన విజ్ఞప్తులు** రాష్ట్ర వ్యవసాయ రంగం బలోపేతానికి సీఎం చంద్రబాబు పలు కీలక

మిగతాది 2 లో...

## నేను ఎవరి బాణాన్ని కాదు

### తెలంగాణ ప్రజల గొంతుకను!: కల్వకుంట్ల కవిత

బీఆర్ఎస్‌లోకి మళ్లీ వెళ్లే ప్రసక్తే లేదన్న కవిత

2029లో స్వతంత్రంగానే బరిలోకి దిగుతానని స్పష్టీకరణ

కుట్రపూరితంగా పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపణ

గత ప్రభుత్వ పాపంలో తనకూ భాగముందంటూ క్షమాపణ



**తెలంగాణ, సందేశం టైమ్స్ :** "నేను ఎవరో వదిలిన బాణాన్ని కాదు.. తెలంగాణ గడ్డపై ప్రజల కోసం ఎక్కుపెట్టిన బాణాన్ని" అని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రాజకీయాల్లో తన పంథా ఇకపై ప్రజల పక్షమేనని, పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని ఆమె తేల్చి చెప్పారు. బుధవారం భువనగిరిలో 'జనంబాట' కార్యక్రమంలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై వస్తున్న విమర్శలపై కవిత స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గత ప్రభుత్వంలో నేను ఎప్పుడూ కీలక పాత్రలో లేను. కుట్రపూరితంగా నన్ను కేవలం నిజామాబాద్‌కే పరిమితం చేశారు. అయితే, ఆ సమయంలో పార్టీలో ఉన్నాను కాబట్టి, ప్రభుత్వ తప్పులకు నేను కూడా బాధ్యురాలినే. ఆ పాపంలో నాకూ భాగముంది. అందుకే ప్రజలను బేషరతుగా క్షమాపణలు కోరుతున్నాను" అని ఆమె పేర్కొన్నారు. తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికను కవిత ఈ సందర్భంగా బయటపెట్టారు. తిరిగి బీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తి అస్సలు లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం మధ్యలో జరిగే ఎలాంటి ఉప ఎన్నికల్లోనూ, ఇతర పోటీల్లోనూ తాను పాల్గొనబోనని చెప్పారు.

మిగతాది 2 లో...

## ఏపీ హైకోర్టులో టీటీడీకి భారీ ఊరట

### స్వర హోటల్‌కు భూ కేటాయింపుపై హైకోర్టులో పిల్

స్వర హోటల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం చట్ట విరుద్ధమన్న పిటిషనర్

భూమార్పిడి ఒప్పందాన్ని రద్దు చేయలేమన్న ఉన్నత న్యాయస్థానం

పిల్ ను కొట్టేసిన హైకోర్టు

**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** తిరుపతి మండలం పేరూరు గ్రామ పరిధిలో టీటీడీకి చెందిన భూమిని పరస్పర భూమార్పిడి విధానంలో పర్యాటక శాఖకు కేటాయించి, అనంతరం దానిని ఒబెరాయ్ గ్రూప్‌కు చెందిన 'స్వర' హోటల్ నిర్మాణానికి ఇచ్చిన వ్యవహారంలో హైకోర్టు జోక్యం

2





## భారీ ఎన్ కౌంటర్ పై అమిత్ షా స్పందన

- ఒడిశా ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టుల మృతి
- నక్సలిజం అంతానికి మరో కీలక అడుగు అన్న అమిత్ షా
- ఆపరేషన్లు మరింత తీవ్రతరమవుతాయని హెచ్చరిక

**జాతీయం, సందేశం టైమ్స్ :** దేశంలో మావోయిస్టు కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది. ఒడిశాలోని కంధమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందిస్తూ.. ఇది నక్సలిజం అంతానికి మరో కీలక అడుగు అని వ్యాఖ్యానించారు. 2026 నాటికి దేశం మొత్తాన్ని నక్సలిజం నుంచి పూర్తిగా విముక్తం చేస్తామని తెలిపారు. ఒడిశాను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. భద్రతా బలగాల ఆపరేషన్లు మరింత తీవ్రతరం అవుతాయని స్పష్టం చేశారు. ఈ ఉదయం కంధమాల్

మిగతాది 2 లో...



## రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి తోలు తీస్తారు?

- అనాథ విద్యార్థులకు సమయానికి భోజనం అందించలేక పోతున్నారన్న హరీశ్ రావు
- ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోందని వ్యాఖ్య
- విద్యార్థుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరిక

2

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అనాథ విద్యార్థులకు సమయానికి భోజనం అందించలేని దయనీయ స్థితిలో కాంగ్రెస్



## ఎక్స్‌లో ఏపీ, తెలంగాణ టాప్ ట్రెండ్స్

### పవన్ సాయం, రేవంత్ నిధులపై నెటిజన్ల చర్చ

ఇప్పటం గ్రామ బామ్మకు పవన్ కల్యాణ్ వ్యక్తిగత ఆర్థిక సాయం

గ్రామ పంచాయతీలకు రేవంత్ రెడ్డి ప్రత్యేక అభివృద్ధి నిధుల ప్రకటన

గత వైసీపీ పాలనపై ఆలయ బంగారం కుంభకోణం ఆరోపణలు

కేసీఆర్ కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర రాజకీయ విమర్శలు

రెండు రాష్ట్రాల్లోనూ సంక్షేమం, అభివృద్ధిపై విస్తృతంగా సాగుతున్న చర్చ



2

**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** క్రిస్మస్ పండుగ సమీపిస్తున్న వేళ, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సోషల్ మీడియా వేదిక 'X' (గతంలో ట్విట్టర్) రాజకీయ, సామాజిక అంశాలతో

## జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో కేసీఆర్ చెప్పాలి

### కేసీఆర్ కుటుంబం తెలంగాణకు శని: బండి సంజయ్

- కాళేశ్వరం స్కామ్ నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల గురించి మాట్లాడుతున్నారన్న సంజయ్.....
- ముడుపుల కోసం తెలంగాణను తాకట్టు పెట్టారని మండిపాటు
- రేవంత్ భాష ఆయన్నే నష్టపరుస్తుందని వ్యాఖ్య

2



## ఏపీ హైకోర్టులో టీటీడీకి భారీ ఊరట

చేసుకోవడానికి నిరాకరించింది. ఈ మేరకు దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. టీటీడీ – పర్యాటక శాఖ మధ్య జరిగిన భూమార్పిడిని రద్దు చేయాలని, స్వర హోటల్స్‌కు భూమి కేటాయింపుపై జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ తిరు క్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ టీటీడీ నుంచి పర్యాటక శాఖ తీసుకున్న భూమిలో స్వర్ణ హోటల్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, భక్తుల కోసం చేపట్టాల్సిన ప్రాజెక్ట్‌ను టీటీడీ వేరే ప్రాంతానికి మార్చిందన్న కారణంతో మాత్రమే భూమార్పిడి ఒప్పందాన్ని రద్దు చేయలేమని స్పష్టం చేస్తూ పిల్‌ను తోసిపుచ్చింది. దీంతో టీటీడీకి హైకోర్టులో భారీ ఊరట లభించినట్లయింది.

## నేను ఎవరి బాణాన్ని కాదు

నేరుగా 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. ఎలాంటి కారణం చెప్పకుండానే తనను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కారణం లేకుండా సస్పెండ్ చేయడం బాధ కలిగించింది. కానీ నా ఆత్మగౌరవం ముఖ్యం. దానిపై రాజీపడను. అందుకే ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడానికి 'జనంబాట' పట్టాను. జాగృతి అనేది కేవలం పార్టీ విభేదాల వల్ల పుట్టింది కాదు.. 19 ఏళ్ల కిందటే తెలంగాణ భాష, సంస్కృతి కోసం ఏర్పడిన సంస్థ" అని గుర్తుచేశారు.

## భారీ ఎన్ కౌంటర్ పై అమిత్ షా స్పందన

జిల్లాలోని గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నమ్మకమైన సమాచారం భద్రతా బలగాలకు అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, ప్రత్యేక బలగాలు ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ సమయంలో మావోయిస్టులు కాల్పులకు దిగడంతో రెండు వర్గాల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. కొంతసేపు కొనసాగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఆ ప్రాంతం నుంచి భారీగా ఆయుధాలు, బుల్లెట్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో హతమైన వారిలో మావోయిస్టు ఉద్యమంలో అత్యంత కీలక నేతగా గుర్తింపు పొందిన పాక హనుమంతు అలియాస్ గణేశ్ కూడా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాయి. గణేశ్ స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూర్. ఆయనపై రూ.1.10 కోట్ల రివార్డు ఉంది. దాదాపు 40 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో కొనసాగుతూ, వివిధ కీలక హోదాల్లో పనిచేశారు. మావోయిస్టు సంస్థాగత విస్తరణలో గణేశ్ కీలక పాత్ర పోషించారని భద్రతా వర్గాలు చెబుతున్నాయి.

## రావులపాలెం మండలంలో మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారి వాజ్ పేయ్ చిత్రపటానికి నివాళులు అర్పించిన బీజేపీ శ్రేణులు అభిమానులు



( సందేశం టైమ్స్ - రావులపాలెం ) రావులపాలెం. భారత ప్రజాస్వామ్య రూపురేఖలను తన మాటలతో, అత్యున్నత నడవడికతో తీర్చిదిద్దిన మహోన్నత రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ శ్రేణులు కొనియాడారు గురువారం నాడు భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు. భారతరత్న మాజీ ప్రధాని వాజ్ పేయ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రావులపాలెం మండలంలోని రావులపాలెంలో ఈతకోటలో ఆయా బూత్ కేంద్రాల్లో పార్టీ శ్రేణులు. అభిమానులు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు పుష్పాలతో ఘన నివాళులు అర్పించారు రావులపాలెంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు నందం శ్రీలక్ష్మి నివాసం వద్ద వాజేపేయ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు గంద్రోతు వీరగోవిందరావు. కొండేటి ఈశ్వర్ గౌడ్. వీర్నాల రమణ బాబు. పూలమాల వేసి పుష్పాలతో నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అటల్ జీ పుట్టినరోజును సుపరిపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు ప్రజాస్వామ్యం వర్ధిల్లేది సంవాదం తోనే కానీ వివాదంతో కాదన్నారు ప్రభుత్వాలు వస్తాయి పోతాయి కానీ దేశం మాత్రం శాశ్వతంగా నిలిచి ఉండాలని ఆయన బలంగా నమ్మారన్నారు రాజకీయం అంటే అధికారం కోసం చేసే పరుగు పందెం కాదని అదొక సేవా యజ్ఞమని అటల్ జీ చాటిచెప్పారన్నారు రాజకీయాల్లో ఆయన పాటించిన హుందాతనం, అందరినీ కలుపుకుపోయే తత్వం దేశమే ప్రథమం అనే ఆయన సిద్ధాంతం భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు నీతి నిజాయితీకి నిలువెత్తు రూపమైన ఆయన నైతిక విలువలతో పరిపాలన అందించారన్నారు రహదారులు రక్షణ సంక్షేమాలతో దేశ అభివృద్ధికి పునాదులు వేసి అన్ని రంగాలను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించారన్నారు.





## క్రిస్మస్ వేడుకలలో వైఎస్ జగన్



పులివెందుల డిసెంబర్ 25 (సందేశం టైమ్స్): క్రిస్మస్ పండగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పులివెందుల పట్టణంలోని సి ఎస్ ఐ చర్చిలో గురువారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్నారు. పులివెందులలోని తన నివాసం నుంచి ఆయన నేరుగా సీఎస్ఐ చర్చికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ప్రార్థనలలో జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి భారతి రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. నిన్న జ్వరంతో బాధపడ్డ ఆయన ఇవాళ కోలుకున్నారు. క్రిస్మస్ వేడుకల అనంతరం ఆయన బెంగుళూరు వెళ్లారు.

# రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎవరి తోలు తీస్తారు?



ప్రభుత్వం ఉందని ఆయన విమర్శించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సిద్ధిపేటలో అనాథ విద్యార్థులను కలిసిన హరీశ్ రావు, వారి సమస్యలు తెలుసుకున్నారు. గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన మెస్ బిల్లులు, కాస్మటిక్ చార్జీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని హరీశ్ గుర్తు చేశారు. ప్రభుత్వం కమీషన్లకే ప్రాధాన్యం ఇస్తోందని, కమీషన్ లేని పనులను కావాలని ఆలస్యం చేస్తున్నట్లు ఆరోపించారు. "విద్యార్థులు కమీషన్లు ఇవ్వలేరు కాబట్టే వారి బిల్లులు చెల్లించడం లేదేమో" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. విద్యార్థుల బిల్లుల విషయంలో గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పారని, కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని మండిపడ్డారు. "మాటలు మాత్రం ఆకాశాన్ని తాకుతాయి... చేతలు మాత్రం గడప కూడా దాటవు" అంటూ సీఎం పనితీరును ఎద్దేవా చేశారు. "నువ్వే ముఖ్యమంత్రివి, నువ్వే విద్యాశాఖ మంత్రివి%ొ% అయినా విద్యార్థుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయంటే ఇంకెవరిని అడగాలి?" అని హరీశ్ ప్రశ్నించారు. బిల్లులు చెల్లించకపోతే తోలు తీస్తానని గతంలో సీఎం చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ తోలు ఎవరి మీద తీస్తారని నిలదీశారు. ప్రభుత్వం తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెరుగుతోందని హెచ్చరించారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ తర్వాత కాంగ్రెస్ నాయకుల్లో భయం మొదలైందని, అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. విద్యార్థుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని... లేకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. విద్య, సంక్షేమ రంగాలను నిర్లక్ష్యం చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.

# జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో కేసీఆర్ చెప్పాలి



తెలంగాణ, సందేశం టైమ్స్ : కృష్ణా నదీ జలాల అంశంపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కాం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ ఇప్పుడు కృష్ణా జలాల విషయాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని స్పష్టంగా చెప్పారు. కృష్ణా జలాల పంపకాల్లో తెలంగాణకు జరిగిన నష్టానికి పూర్తిగా కేసీఆర్‌నే బాధ్యుడని వ్యాఖ్యానించారు. కృష్ణా నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను కేసీఆర్ తాకట్టు పెట్టారని బండి సంజయ్ ఆరోపించారు. "కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. 575 టీఎంసీల కోసం పోరాడాల్సిన సందర్భంలో కేసీఆర్ మౌనంగా ఉన్నారు. ముడుపుల కోసమే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారు" అని విమర్శించారు. ఈ విషయాలను ఆధారాలతో సహా బయట పెట్టింది తానేనని చెప్పారు. ఏపీ మాజీ సీఎం జగన్‌తో ఏం ఒప్పందం జరిగిందో ప్రజలకు కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిపించానని బండి సంజయ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ పాత్ర పూర్తిగా ద్రోహపూరితమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో వెలుగులోకి వస్తున్న అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని లేవనెత్తుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం స్కాం నుంచి తప్పించుకునేందుకే కొత్త ఇష్యూ తీసుకొచ్చారని దుయ్యబట్టారు. కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణకు భారంగా మారిందని బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్ కుమారుడు కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారు. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం" అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల్ని కూడా బండి సంజయ్ తప్పుబట్టారు. "ఎవరి మీద విమర్శలు చేసినా మాటల తీరులో సంయమనం ఉండాలి. రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాష సరైనది కాదు. ఇలాంటి మాటలు చివరకు ఆయన్నే నష్టపరుస్తాయి" అని సూచించారు. హిందూ ధర్మం ప్రతి వ్యక్తి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటుందని తెలిపారు. గతంలో కేసీఆర్ అనుచితంగా మాట్లాడినప్పుడు తాము ఖండించామని, ఇప్పుడు సీఎం రేవంత్ కూడా తన మాటలపై పునరాలోచన చేసుకోవాలని సూచించారు.

# ఎక్స్‌లో ఏపీ, తెలంగాణ టాప్ ట్రెండ్స్




హోరెత్తుతోంది. 2025 డిసెంబర్ 24న ప్రభుత్వాల నిర్ణయాలు, సంక్షేమ పథకాలు, రాజకీయ నాయకుల పర్యటనలు, మాటల యుద్ధాలపై నెటిజన్లు విస్తృతంగా చర్చిస్తున్నారు. ఇరు రాష్ట్రాల్లోని ప్రజల ఆలోచనలకు, ప్రభుత్వాల ప్రాధాన్యతలకు అద్దం పడుతూ ట్రెండింగ్‌లో నిలిచిన ప్రధానాంశాలపై ఓ సమగ్ర విశ్లేషణ.


**ఆంధ్రప్రదేశ్: సంక్షేమం, అభివృద్ధి, మానవత్వంపై ఫోకస్** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంస్కరణలు, రాజకీయ నాయకుల వ్యక్తిగత పర్యటనలు ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పటం గ్రామంలో ఓ వృద్ధురాలిని పరామర్శించి, ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందించడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. సంక్రాంతి ఖర్చుల కోసం రూ.50 వేలు, తన జీతం నుంచి నెలవారీ సాయం అందిస్తామని ప్రకటించిన పోస్ట్ వైరల్ అయింది. ఇది మానవతా దృక్పథంతో కూడిన నాయకత్వానికి నిదర్శనమని పలువురు కొనియాడుతున్నారు. #APTowardsGramaSwaraj వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. మరోవైపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ) ఆసుపత్రులు, వైద్య కళాశాలల ఏర్పాటుపై జరిపిన సమీక్ష కూడా చర్చకు దారి తీసింది. పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 30% నిధులు భరించేలా ప్రణాళికలు రూపొందించడంపై కొందరు హర్షం వ్యక్తం చేయగా, గత అనుభవాల దృష్ట్యా ప్రాజెక్టుల అమలుపై మరికొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు, నటుడు నాగార్జున గుడివాడలోని ఏఎన్నార్ కాలేజీకి స్కాలర్‌షిప్‌ల కోసం రూ.2 కోట్లు విరాళం ఇవ్వడం కూడా ట్రెండింగ్‌లో నిలిచింది. గుడివాడ–విజయవాడ రహదారి వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చిన ప్రభుత్వాన్ని అభినందిస్తూ, విద్యాసంస్థల పునరుద్ధరణపై చర్చ జరుగుతోంది. మరోవైపు, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని ఆరోపిస్తున్న "ఆలయ బంగారు తాపడం స్కామ్" పైనా నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. #ShameOnYouJagan, #AntiHinduJagan హ్యాష్‌ట్యాగ్‌లతో జవాబుదారీతనం డిమాండ్ చేస్తున్నారు.


**తెలంగాణ: గ్రామాలకు నిధులు, రాజకీయ మాటల యుద్ధం** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడుగా తీసుకుంటున్న నిర్ణయాలు, రాజకీయ విమర్శలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. రాష్ట్రంలోని 12,706 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అభివృద్ధి నిధులను ప్రకటించడం వైరల్‌గా మారింది. పెద్ద పంచాయతీలకు రూ.10 లక్షలు, చిన్నవాటికి రూ.5 లక్షలు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. #VillageDevelopment, #TelanganaRising 2047 హ్యాష్‌ట్యాగ్‌లతో నెటిజన్లు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. అదే సమయంలో, మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని రేవంత్ రెడ్డి చేస్తున్న ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వేడిని రాజేస్తున్నాయి. "కేటీఆర్! నీ లాగులో తొండలు విడిచి కొడతా బిడ్డా!" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పోస్టులు వేల సంఖ్యలో రీపోస్టులు అవుతున్నాయి. దీనిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతుదారుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం నడుస్తోంది. సంక్షేమ పథకాలైన 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు చీరల పంపిణీ వంటివి #PrajaPalana హ్యాష్‌ట్యాగ్‌తో ట్రెండ్ అవుతున్నాయి. అలాగే, యాసంగి పంటల కోసం మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో 3.5 లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేయాలన్న నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వ్యవసాయానికి చేయూతనివ్వండి



ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందుంచారు. పీఎం కృషి సిచాయి యోజన కింద సూక్ష్మ సాగునీటి విస్తరణకు అదనంగా రూ.695 కోట్లు కేటాయించాలని కోరారు. రూ.200 కోట్ల అంచనాతో కొబ్బరి పార్క్, అత్యాధునిక ఆక్వా ల్యాబ్, రాష్ట్రంలో మామిడి రైతుల కోసం ప్రత్యేకంగా మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు ఏపీని సహజ సాగుకు 'జాతీయ వనరుల రాష్ట్రం'గా ప్రకటించాలని, రాబోయే ఐదేళ్లలో 20,000 అదనపు సహజ సాగు క్లస్టర్లను మంజూరు చేయాలని కోరారు. పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు, ఆహార శుద్ధి ఇంక్యుబేషన్ సెంటర్లు, పొగాకు సేకరణకు ఆర్థిక సాయం వంటి అనేక అంశాలను వినతిపత్రంలో పొందుపరిచారు.





# పైడిపర్రులో రంగా విగ్రహావిష్కరణ

## ఎమ్మెల్యేలు బొలిశెట్టి, ఆరిమిల్లి





**తణుకు,డిసెంబరు26( సందేశం టైమ్స్)** వంగవీటి మోహన రంగా 37 వ వర్ధంతిని పురస్కరించుకుని తణుకు మండలం పైడిపర్రులో నూతనంగా ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని తణుకు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే లు ఆవిష్కరించారు. అసంఘటిత కార్మికుల హక్కుల కోసం రంగా నిరంతరం పోరాడారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజల్లో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకుని వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. వంగవీటి మోహన రంగా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత పని చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం మరణించినా రంగా జ్ఞాపకాలు ప్రజల మనస్సుల్లోంచి చెరిగిపోలేదనడానికి నేటి విగ్రహావిష్కరణే నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, కాపు సంఘం రాష్ట్ర నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వద్ద వంగవీటి మోహనరంగా విగ్రహానికి తొలుత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే రాధాకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# ఐవీఎం ప్రెసిడెంట్ డా. సురేష్ కు సేవారత్న అవార్డ్



**చల్లపల్లి, డిసెంబరు 26(సందేశం టైమ్స్ )** సుదీర్ఘకాలంగా పేదల సేవలో ఉన్న చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ సేవారత్న అవార్డు అందుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా కోడూరులో గురువారం రాత్రి ప్రముఖ వ్యాపారవేత్త తిరుపతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎస్ఆర్ గ్రూప్ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ముఖ్య అతిథి మంత్రి కొల్లు రవీంద్ర, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ వేములపల్లి సురేష్ కు టీఎస్ఆర్ గ్రూప్ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ సేవలను మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్



**నరసాపురం, డిసెంబరు 26 (సందేశం టైమ్స్)** జనసేన పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంనిర్వహించారు ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ స్వయంగా పరిశీలించి, అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అనేక సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు. తక్షణ పరిష్కారం సాధ్యం కాని సమస్యలపై సంబంధిత పై అధికారులకు వెంటనే చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించేలా స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు ఆకన చంద్రశేఖర్, మొగల్తూరు సొసైటీ అధ్యక్షులు నిప్పులేటి తారక రామారావు, ఏఎంసి వైస్ చైర్మన్ దేశినీడి గంగాధర్, పోలిశెట్టి నళిని, బొమ్మిడి సూర్యకుమారి, కొప్పాడ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో యువకుని మృతి



**నరసాపురం రూరల్ , డిసెంబరు 26 (సందేశం టైమ్స్)** మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామం వెంకట రావు తోటలో కరెంట్ షాక్ తో యువకుడు మృతి చెందాడు. స్థానికులు వివరాలు ప్రకారం సీతరామపురంలో శుక్రవారం క్రిస్మస్ ఏర్పాటు చేస్తున్నారు. జెట్టిపాలెం గ్రామానికి చెందిన శీలం అభిరామ్ (19) చెట్టు ఎక్కి మైక్ కడుతున్నాడు. 11కెవి వైర్ తగిలి ప్రమాదవశాత్తు కింద పడిపోగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు మరణించినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కత్తవపాడులో ' అమరజీవి జలధార' కు శంకుస్థాపన

## తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ




**తణుకు, డిసెంబరు 26 .(సందేశం టైమ్స్ ):** శుద్ధిచేసిన తాగునీటిని ఇంటింటికి అందించాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం కత్తవపాడు గ్రామంలో ఇంటింటికి తాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా అమరజీవి జలధార కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి మొదటి దశలో తణుకు నియోజకవర్గాన్ని ఈ పథకం అందించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తణుకు నియోజకవర్గం దాదాపు రూ. 54 కోట్ల వ్యయంతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే కార్యక్రమాన్ని తెచ్చామని అన్నారు. 2027 నాటికి ఈ పథకాన్ని పూర్తి చేసే విధంగా ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. గ్రామంలో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మించుకుని దీని ద్వారా మండలంలో అనేక గ్రామాలకు ముఖ్యంగా శివారు గ్రామాలకు నూరు శాతం తాగునీటి సమస్య లేకుండా కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ ముఖ్యంగా గ్రామీణ శాఖలో రోడ్లు తాగునీటి ప్రాజెక్టులకు పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేసి అభివృద్ధి సంక్షేమ పథకాలకు పెద్ద పేట వేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా రోడ్లు అభివృద్ధి చేస్తూ కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని అన్నారు. వచ్చే ఏడాది చివరినాటికి పంచాయతీ రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రణాళికలు చేశామని చెప్పారు. దీంతో పాటు ఆర్ అండ్ బి రోడ్లు సైతం నిర్మాణాలు పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సి ఐ టి యు అఖిల భారత మహాసభ లు జయప్రదం చేయాలి



**దేవరపల్లి, డిసెంబరు 26 (సందేశం టైమ్స్) :** విశాఖపట్నంలో సిఐటియు 18 అఖిల భారత మహాసభలు జనవరి 4 నుండి జరుగుతాయని , బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఎస్ భగత్ పిలుపునిచ్చారు. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో నవచైతన్య టాక్సీ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు రాపాక గంగరాజు నాయకుల ఓబా చంద్రరావు ఎత్తులు సత్తియా ట్రక్ ఆటో యూనియన్ నాయకులు కోడి సూరిబాబు, ఏలపోరు పండు టీ తిమ్మరాజు ఆర్ మనీ వై సత్తిబాబులు పాల్గొన్నారు.

# రాజమండ్రి పార్లమెంట్ నియోజక వర్గ టిడిపి సెక్రటరీగా బళ్ల సూర్యచక్రం



**దేవరపల్లి, డిసెంబరు 26 (సందేశం టైమ్స్ ):** తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన సీనియర్ తెదేపా నాయకులు బళ్ల సూర్యచక్రం రాజమండ్రి పార్లమెంట్ పార్టీ కార్యదర్శిగా నియమితులయ్యారు ఈ సందర్భంగా శుక్రవారం ప్రకటన విడుదల చేశారు ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలుపుతూ పార్టీ కోసం అహర్నిశలూ శ్రమిస్తూ ప్రజలకు తలలో నాలుకలా ఉంటూ ప్రజాభిమానం ప్రేమ పొందిన సూర్యచక్రం మానవత స్వచ్ఛంద సంస్థ బాధ్యుని గానూ అత్యాత్మిక కార్యక్రమాల్లోనూ విరివిగా సేవలు అందిస్తున్నారని అన్నారు . శివాలయం ఆలయ కమిటీ చైర్మన్ గా సూర్యచక్రం గతంలో బాధ్యతలు చేపట్టి అభివృద్ధి పథంలో నడిపించారు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందనుటకు ఇదే నిదర్శనమని రాబోయే స్థానిక ఎన్నికల్లో పూర్తి విజయం సాధిస్తామని తనకు బాధ్యతలు అందించిన గోపాలపురం శాసన సభ్యులు మద్దిపాటి వెంకటరాజు, టీడీపీ శ్రేణులకు సూర్యచక్రం కృతజ్ఞతలు తెలిపారు

# రంగా విగ్రహాలకు రాధా రంగా మిత్ర మండలి నివాళులు






**మచిలీపట్నం,డిసెంబరు26(సందేశం టైమ్స్ ప్రతినిధి):** మచిలీపట్నం నియోజకవర్గంలో శుక్రవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వంగవీటి రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు రాయగిరి రామ్ మోహన్ రావు ఆధ్వర్యంలో బందరు మండలం పరిధిలోని గ్రామాలలో చిన్నాపురం , వాడపాలెం ,పెద యాదర , కొత్త వాడపాలెంలో ఉన్న రంగా విగ్రహాలకు నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గళ్లాతిమోతి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, శివయ్య గణేష్ పృద్వి కృష్ణ ధర్మతేజ జున్ను నాగరాజు నాంచారయ్య నిరంజన్ అడుసుమిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కోడి పందాలు, పేకాట శిబిరం పై పోలీసులు దాడులు

**గోపాలపురం ,డిసెంబరు 26(సందేశం టైమ్స్):** గోపాలపురం మండలం దొండపూడి గ్రామంలో మేదరపేటలో కోడిపందాలు నిర్వహిస్తున్న వారిపై గోపాలపురం పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి ఈ రెండు కోడి పుంజులు రెండు కోడి కత్తులు 5 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని ప్రొబేసినరీ ఎస్ఐపి శివ గణేష్ తెలిపారు. అదే విధంగా మండలంలోని కొవ్వూరుపాడు గ్రామంలో పేకాట శిబిరంపై కూడా దాడి చేసి వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద నుండి పేక ముక్కలు, మూడు వేల రూపాయలు నగదు సీజ్ చేసినట్లు తెలిపారు . ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలు మేరకు ఈ దాడులు నిర్వహించామని గోపాలపురం మండల పరిధిలో కోడిపందాలు పేకాట ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా శివ గణేష్ హెచ్చరించారు.

# ఎన్టీఆర్ ' వర్సిటీ గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ మహమ్మద్ అబ్బాస్ కు సత్కారం

## పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లా బకష్



**రాయచోటి, డిసెంబరు 26(సందేశం టైమ్స్):** ఎన్టీఆర్ డెంటల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ నుండి గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ షేక్ మహమ్మద్ అబ్బాస్ ను జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ జనరల్ సెక్రటరీ షేక్ అల్లా బకష్ , అన్నమయ్య జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఫయాజ్ , మాజీ రాయచోటి పట్టణ అధ్యక్షుడు టైగర్ శర్వాని ఫారుక్ , జిల్లా సెక్రెటరీ ఆఫీజుల్లా, ఎస్ ఎస్ భాష,(ఐయూఎంఎల్) డాక్టర్ సుహెల్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ సుహేల్ లు అభినందించారు. రాయచోటి పట్టణంలోని డాక్టర్ నివాసానికి వెళ్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అల్లా బకష్ మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆయన అన్నారు. రాయచోటి లో డెంటల్ ఆసుపత్రిని ప్రారంభిస్తే తమ పూర్తి స హాయ సహకారాలు అందిస్తానన్నారు.

# వంగవీటికి ఘన నివాళులు



**దేవరపల్లి, డిసెంబరు 26( సందేశం టైమ్స్ ):** తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం ఎర్న గూడెంలో రంగా వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వ హించారు . స్వర్గీయ వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతి సందర్భంగా రంగా ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుట్టా జగన్మోహనరావు, బళ్ల సత్యనారాయణ విచ్చేసారు.

# అక్రమ ఆలయ నిర్మాణంపై హైకోర్టు సీరియస్

**భీమవరం, డిసెంబరు26 (సందేశం టైమ్స్):** పెంటపాడు మండలం ప్రతిపాడు గ్రామంలో ప్రభుత్వ/జిల్లా పరిషత్ రహదారి భూమిపై అనధికారంగా విగ్రహ ప్రతిష్ఠ, శివాలయం నిర్మాణం జరగడంపై పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి తీవ్రంగా స్పందించారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన పలువురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంలో కలెక్టర్, పశ్చిమ గోదావరి ఎస్పీకి రాసిన లేఖలో తక్షణమే స్థానిక సీఐ, ఎస్ ఐ లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాంతో వారిని తక్షణమే సస్పెండ్ చేశారు. పర్యవేక్షణలో లోపాలపై తాడేపల్లిగూడెం ఆర్డీవోకు, అలాగే డీఎల్పీవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ కోరినట్లు కలెక్టర్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో సమర్పించిన నివేదికను పరిశీలించిన కలెక్టర్, పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. ఈ భూమి జిల్లా పరిషత్‌కు చెందినదని, విగ్రహ ప్రతిష్ఠకు లేదా ఆలయ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆర్డీవో నివేదికలో పేర్కొన్నారు. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు, జిల్లా పరిపాలన పునరావృత సూచనలు ఉన్నప్పటికీ, ఆర్.ఎస్. నం.7-13బి (0.13 సెంట్లు) ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణం కొనసాగింది. దీనివల్ల హైకోర్టులో దావాలు నమోదయ్యాయు. ఈ నేపథ్యంలో ప్రతిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి జె. నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో వై.వి.ఆర్. వరప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి వసంసెట్టి ఉమాదేవి, పెంటపాడు తహసీల్దార్ టీ. రాజా రాజేశ్వరి విధుల్లో నిర్లక్ష్యం వహించారని పేర్కొంటూ కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల క్షేత్రస్థాయి యంత్రాంగం సమన్వయం లేకపోవడం వల్లే హైకోర్టు ఆదేశాల ఉల్లంఘన జరిగిందని కలెక్టర్ వ్యాఖ్యానించారు. అవసరమైన బందోబస్తు, రక్షణ కల్పించడంలో విఫలమవడం జిల్లా పరిపాలనను దావాలకు గురిచేసిందని తెలిపారు. ఈ నిర్లక్ష్యం ప్రభుత్వ ఉద్యోగులకు తగినది కాదని, విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా పరిగణించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా భూముల రక్షణ, న్యాయస్థాన ఆదేశాల అమలు విషయంలో ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని హెచ్చరిస్తూ, సస్పెండ్ అయిన అధికారులపై శాఖాపరమైన విచారణలు ప్రారంభించాలని స్పష్టం చేసారు.

# పోరాటయోధుడు,పేదల ఆరాధ్యదైవం కామ్రేడ్ కేవల్ కిషన్

ప్రజలు ఒక వ్యక్తిని అభిమానిస్తే, గుండెల్లో పెట్టుకుని కొలుస్తారు అనడానికి నిదర్శనమే కేవల్ కిషన్..

- ఆయన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి...
- నీలం మధు ముదిరాజ్..
- ఘనంగా కేవల్ కిషన్ వర్ధంతి...



**సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి (డిసెంబర్ 26)** పేదల సంక్షేమం కోసం పరితపించిన పోరాట యోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు అన్నారు. శుక్రవారం కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా చిట్కుల్ ఎన్ఎంఆర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు, మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో స్వర్గీయ కేవల్ కిషన్ ముదిరాజ్ స్మారకర్తము నిర్మించిన సమాధి వద్ద ప్రతి సంవత్సరం ఆయన వర్ధంతి రోజున నిర్వహించే జాతర ఎంతో ప్రసిద్ధి చెందింది అని నీలం మధు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసి ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు కేవల్ కిషన్ అన్నారు. మెదక్ ప్రాంతంలోని జమిందారుల ఆగడాలతో విసిగి వేసారిన పేదలను ఒక్కటి చేసి ప్రజాపోరాటాలు నిర్వహించారని తెలిపారు. దున్నేవాడికే భూమి అంటు భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిపెట్టారని కొనియాడారు. అలాగే కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి హక్కుల సాధనకు కృషి చేశాడన్నారు. అలాంటి మహనీయున్ని ప్రజలు స్మరించుకుంటు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతూ జాతరను చేయడం ప్రశంసనీయమని తెలిపారు. ప్రజల కోసం జీవించి ప్రాణాలర్పించిన మహనీయులని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకొని కొలుస్తారనడానికి నిదర్శనమే కెవల్ కిషన్ పోరాటం అన్నారు. అలాంటి మహనీయుని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సర్పంచులు మణిదీప్, దానంపల్లి సుజాతసత్యం, గీతనరేందర్, కృష్ణ, నాయకులు శ్రీనివాస్,మహేష్, గణేష్, ప్రవీణ్, రంజిత్, పాల్గొన్నారు



# బోరంచ గ్రామంలో ఘనంగా చీరల పంపిణీ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 26డిసెంబర్ సంగారెడ్డి జిల్లా** నారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలో మహిళ సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో నారాయణఖేడ్ నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ పి సంజీవ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చీరల పంపిణీ కార్యక్రమం గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప నేతృత్వంలో సక్రమంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని పేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక భారం తగ్గించడంతోపాటు, మహిళల గౌరవాన్ని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలవుతుందని తెలిపారు. ప్రతి అర్హురాలైన మహిళలకు చీర అందజేస్తామని, మహిళలు కుటుంబానికి మాత్రమే కాదు, సమాజ నిర్మాణానికి కూడా పునాదులు అని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా గ్రామస్థాయిలో పంచాయతీ పూర్తి బాధ్యతతో పనిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేదల, మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో ప్రత్యక్షంగా ప్రజలకు అందుతున్నాయి అంటే ఇది ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన కృషికి నిదర్శనమని అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా సంక్షేమ పథకాలు మహిళల జీవితాల్లో మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు. మహిళలకు ఆర్థిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సామాజిక సమానత్వానికి దోహదపడుతున్నాయని అన్నారు. గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, అందుకే మహిళల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకొని ప్రభుత్వ పథకాలు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. గ్రామస్థాయిలో రాజకీయ భేదాభిప్రాయాలు పక్కనపెట్టి సంక్షేమ కార్యక్రమాలు సమిష్టిగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సక్రమంగా అమలయ్యేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘాల అధ్యక్షురాలు సాయమ్మ,వీఓఏ బైండ్ల అనసుజ,గ్రామ వార్డ్ మెంబర్ బాలకృష్ణ,గ్రామ దేవస్థానం చైర్మన్ మల్లయ్య,గ్రామ పెద్దలు నర్సింహులు, యువత యువకులు వివిధ మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ కేలండర్ ఆవిష్కరణ



**శేరిలింగంపల్లి సందేశం టైమ్స్ ప్రతినిధి..** సమాజ హితాన్ని లక్ష్యంగా చేసుకుని నిరంతరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల దగ్గరైన యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం , చేనేత , టెక్స్టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ లు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజం కోసం నిస్వార్థంగా సేవలందిస్తూ సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే ట్రస్ట్‌గా యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ నిలుస్తోందని ప్రశంసించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ తుమ్మల నాగేశ్వరరావు, బండి రమేష్ , జగదీశ్వర్ గౌడ్ లని శాలువాలతో సత్కరించి గౌరవించారు. అనంతరం యలమంచి ఉదయ్ కిరణ్ ని వారు శాలువా లతో సత్కరించారు. ఈ సందర్భంగా యలమంచి ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా మియాపూర్ డివిజన్ పరిధిలో చేపట్టిన విస్తృత సేవా కార్యక్రమాలను గుర్తు చేశారు. వాటిలో వేసవి కాలంలో చలివేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, జియోమెట్రీ బాక్సుల పంపిణీ, వృద్ధాశ్రమాల్లో పండ్ల పంపిణీ, ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, మందులతో కూడిన మెగా మెడికల్ హెల్త్ క్యాంపులు, అనాథాశ్రమాల్లో పోషకాహార భోజన పంపిణీ, దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా వస్తువుల పంపిణీ, దివ్యాంగులకు ఆహారం పుస్తకాల పంపిణీ, యువతలో క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా అవార్డుల ప్రదానం, వాలీబాల్ కిట్లు, క్యారమ్ బోర్డులు వంటి ఆట సామగ్రి పంపిణీ, పేదలకు ఉచిత మందుల పంపిణీ, పేద కుటుంబాలకు బెడ్‌షీట్ల పంపిణీ, ఉచిత కంటి పరీక్షా శిబిరాలు ,నిపుణుల సలహాలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు పాఠశాల ఫీజు సహాయం, సామాజిక అవగాహన మరియు సమాజ ఐక్యత కోసం క్యాలెండర్ పంపిణీ, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభావంతమైన మహిళల సన్మానం, గ్రేస్ అనాథాశ్రమంలో అన్నదానం, జిహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు, ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ఆహార పంపిణీ, ప్రతి సంవత్సరం కొనసాగించే వేసవి చలివేంద్రాల కార్యక్రమం, వెనుకబడిన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ వంటి అనేక సేవా కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. సామాజిక సేవ రంగంలో ఆయన చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా యలమంచి ఉదయ్ కిరణ్ కి ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు లభించాయి. అందులో జి హెచ్ పి యు సంస్థ ద్వారా "సేవా రత్న జాతీయ అవార్డు ఉత్తమ సామాజిక సేవకు", సామాజిక సేవ రంగంలో గౌరవ డాక్టరేట్, ప్రెస్ వింగ్స్ క్లబ్ నుండి "బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు", అలాగే విశ్వ ఆర్ట్స్, మన కళాక్షేత్రం ద్వారా ప్రదానం చేసిన "డా. ఏ.పీ.జే. అబ్దుల్ కలాం జాతీయ సేవా రత్న పురస్కారం" ముఖ్యమైనవిగా నిలుస్తున్నాయి. ఇవి ఆయన సేవా ప్రయాణానికి జాతీయ స్థాయిలో లభించిన



గౌరవంగా పేర్కొన్నారు. సామాజిక కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటున్నందుకు యలమంచి ఉదయ్ కిరణ్ ని నాయకులు అభినందించారు. యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, టీమ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే నాయకులు బొద్దు రవి, కలగర శ్రీనివాస్, ప్రసాద్, రత్నాకర్, బిక్కసాని నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు అలపాటి శివాజీ , కరివేద వెంకటేశ్వర రావు , శ్రీకాంత్, జి.వి. రావు ,మన్నేపల్లి సాంబశివరావు, రావిపాటి వెంకటేశ్వర రావు, కోటేశ్వర రావు, మిరియాల ప్రీతమ్, వేణు, కనిగంటి ప్రభాకర్ రావు , రాజు, వురిటి వెంకటరావు, కావూరి ప్రసాద్, సాయి తులసి, కృష్ణ పటేల్, రాంచందర్, ఇంద్రనాథ్, శరత్, రమేష్, అశోక్, నాని, కృష్ణ, వంశీ, వాసు, చలసాని భరత్, శ్రీలత, రత్నాచారి, గోపీ, రాజేష్, సాయి నిఖిల్, సతీష్, ప్రవీణ్, వినోద్, మహమ్మద్, వినయ్ తదితర యువ నాయకులు పాల్గొని తమ సమిష్టి కృషితో కార్యక్రమాన్ని ఘన విజయంగా నిలిపారు అని తెలిపారు.

# అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 26డిసెంబర్ సంగారెడ్డి జిల్లా** నారాయణఖేడ్ నియోజకవర్గంలో నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ రామ మందిరం (అయ్యప్ప సేవా సమితి) ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం శ్రీ రామ మందిర సన్నిధాన అయ్యప్ప గురుస్వామి కోస్గికర్ శివానంద్ గురుస్వామి ఆధ్వర్యంలో జరుగనుంది. మానవసేవే మాధవసేవగా భావించి గత ఐదేళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని గురుస్వాములు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్లు పటేల్, మధుసూదన్ రెడ్డి, డి. ఓం ప్రకాష్, సుబ్బారెడ్డి, దత్తు, రాచప్ప, సంగప్ప, వంశీ, నగేష్, మదన్ లాల్, సూర్యకిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా వంగవీటి శ్రీనివాస్ రావు



**సూర్యాపేట, సందేశం టైమ్స్:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంగవీటి శ్రీనివాస్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి ఆదివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆదేశాల మేరకు, మరియు 'సంఘటన్ పర్వ్ 2024-25' కార్యక్రమంలో భాగంగా ఈ నియామకం చేపట్టినట్లు జిల్లా అధ్యక్షురాలు తెలిపారు. పార్టీ పట్ల శ్రీనివాస్ రావుకు ఉన్న అంకితభావం, ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు ఆమె పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నియమాలకు కట్టుబడి, క్రమశిక్షణతో జిల్లాలో పార్టీ బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు ఆమె నియామక పత్రంలో వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు వంగవీటి శ్రీనివాస్ రావు.. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకి, రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ గారికి, మరియు జిల్లా అధ్యక్షురాలు శ్రీలతా రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రంగా వర్ధంతికి అన్నదానం!

**నరసాపురం, డిసెంబరు 26 (సందేశం టైమ్స్)** పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరుపేదల పెన్నిధి, స్వర్గీయ వంగవీటి మోహన రంగా గారి 37వ వర్ధంతి సందర్భంగా మొగల్తూరు, నరసాపురం మండలం, నర్సాపురం పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. బస్ స్టాండ్ వద్ద జనసేన పార్టీ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు జక్కం బాబ్జి,వశిష్ఠ రాయల్ క్లబ్ వారి ఆధ్వర్యంలోఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, వంగవీటి మోహన రంగా పేదల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, వర్ధనపు ప్రసాద్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, యర్రంశెట్టి ఫణి, గునిశెట్టి శ్రీనివాస్, శిరిగినీడి రాజ్యలక్ష్మి, డా" మాదంశెట్టి కోటేశ్వరరావు, నిప్పులేటి తారక రామారావు, పోలిశెట్టి నళిని, పిప్పళ్ళ సుప్రజ, దేవిరెడ్డి ధర్మారావు వంగవీటి మోహన రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అట్టేపల్లి పురుషోత్తము శోభారాణి, రామ ప్రభు స్వప్నల వివాహ వార్షికోత్సవం..





**శేరిలింగంపల్లి సందేశం టైమ్స్ ప్రతినిధి..** మియాపూర్ ప్రగతి ఎన్ క్లేవ్ వాస్తవ్యులు సాయి బాలాజీ ఇన్ఫ్రా సంస్థ అధినేతలు అట్టేపల్లి పురుషోత్తము శోభారాణి, రామ ప్రభు స్వప్నల వివాహ వార్షికోత్సవం ను మియాపూర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ , మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రసాద్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డి ఎస్ ఆర్ కే ప్రసాద్,బండారు రామచందర్ ముదిరాజ్ , పురుషోత్తం యాదవ్ , సమ్మెట ప్రసాద్ , మహేష్ యాదవ్ , పుట్టా వినయ్ కుమార్ గౌడ్ , బండారు గోపాల్ ముదిరాజ్, మోహన్ ముదిరాజ్, రాజేంద్ర ప్రసాద్ , స్వామి , నాగరాజు , వల్లభనేని సత్యనారాయణ , బాబ్జి , వినయ్ ముదిరాజ్ , ప్రశాంత్, ఉమాదేవి, సత్తి రెడ్డి , రాజశేఖర్, శ్రవణ్ కుమార్, వినోద్, శ్రీకాంత్, సతీష్, లతపాటు స్నేహితులు, శ్రేయోభిలాషులు, సాయి బాలాజీ ఇన్ఫ్రా సంస్థ ఉద్యోగులు, కలిసి దంపతులను శాలువాలతో సత్కరించి, పూల బొకేలను అందించి హృదయ పూర్వక పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. మియాపూర్ విలేజ్ లోని సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మియాపూర్ డివిజన్ నుండి డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు, ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ప్రసాద్ , ప్రసాద్ ఫౌండేషన్ సభ్యులు భాష, రవి, సురేందర్ , రాంబాబు, మూర్తి, వెంకట్రావు, ఎం ఆర్ కే చౌదరి, వినోద్ చౌదరి, శ్రీకాంత్, పెద్దబాబు ,కమలాకర్ రెడ్డి, అభిజిత్, ప్రసాద్, శేఖర్ నాయుడు, నాని, రామాంజనేయులు, రాము, పవన్ రెడ్డి, బొజ్జ రవికుమార్, సింహాచలం, బాలు తదితరులు అట్టేపల్లి దంపతులకు పెళ్లి రోజు సందర్భంగా వారిని కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times3-82, Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508206Gmail : sandeshamtimes@gmail.comWebsite: https://sandeshamtimes.comPublisher : MADDINENI NAGESWARA RAOAddress104, HILLS APARTMENT, Press (Name & Address)SUNDAY PRINTING PRESS3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH-522006